
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH



JANUARY 1995

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు M.O. చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్యు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | కీర్తన పుస్తకం | రూ. 14-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్యు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు సైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**

Sambamurthi St., Ramaraopeta,

KAKINADA - 533 004.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone ; 0884-73722

Editor ; J.C. CHOATE

Managing Editor JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 జనవరి 1995 సంచిక 6


## సంపాదకీయం

### సంఘముతో చేర్చబడుట అనగా నేమి?

### ( What it means to be Added to the Church )

ఏదో ఒక సంఘములో చేరుటనుగూర్చి ప్రజలు చెబుతారు. ఒక క్లబ్బులో చేరునట్లుగా సంఘములో కూడ చేరవచ్చని వారి యభిప్రాయము. ఇట్టి సందర్భాల్లో ఆ సంఘములో యున్న సభ్యులు క్రొత్త వానిని చేర్చుకోవాలో, వద్దో నిర్ణయిస్తారు. అంటే ఆ క్రొత్త వాని విషయమై ప్రభువుకు గాక, వాటి సభ్యులకే ఎక్కువ పలుకుబడి యున్నట్లగుపడతాది. అయితే ఒకని సంఘముతో చేర్చే పనిలో ప్రభువుయొక్క పాత్ర ఒకటి యున్నది. నిజానికి ఒకడు క్రీస్తు సంఘ సభ్యుడు కావలెనంటే, రక్షింపబడవలెనంటే యిది ప్రాముఖ్యము.

మొదటిగా, ప్రభువు ఒకేఒక్క సంఘమును స్థాపించెనని, అది ఆయనకు మాత్రమే చెందునని మనము అర్థము చేసుకోవాలి (మత్త

16 : 18). ఆయనే దానికి పునాది (1 కొరింథీ 3 : 11), దాని శిరస్సు (కొలస్స 1 : 18), రక్షకుడు (ఎఫెసీ 5 : 23). అది ఆయన నామము ధరించును (రోమా 16 : 16). సంఘము ఆయన ఆత్మీయ శరీరము, ఆత్మీయ కుటుంబము (1 కొరింథీ 12 : 27; 1 తిమో 3 : 15). అంతే కాదు, క్రీస్తే ఆ శరీరమునకు రక్షకుడు. గనుక, ఎవరాయన సంఘములో యుండాలో, ఎవరుండకూడదో నిర్ణయించే అధికారము ఆయనకే ఎక్కువ యున్నది. అట్టి నిర్ణయాధికారము ఏ మానవునికీ లేదు. ఒకడు దేవుని చిత్తాన్ని బట్టి నడుచుకొనేటప్పుడు, అతడు హృదయపూర్వకముగా ఆయన చిత్తానికి విధేయుడయ్యాడో లేదో యను దానిని నిర్ణయించేవాడు ప్రభువే. అతడు హృదయ పూర్వకముగా లోబడినయెడల ప్రభువే అతనిని సంఘముతో చేర్చుకొనును (అపొ. కా. 2 : 47). అతడు ప్రభువుయొక్క ఆజ్ఞలకు లోబడనియెడల, ఎన్ని చెప్పినను సరే అతడు రక్షింపబడినవాడు కాదు. సంఘముతో ప్రభువుచే చేర్చబడినవాడు కాదు.

ఇంకొక మాటలో ఒకడు దేవుని వాక్యమును వినినప్పుడు అది అతని హృదయంలో జనించును. అతడు ప్రభువుయొక్క ఆజ్ఞలకు లోబడుచు పాపముల విషయమై మారుమనస్సు బొంది, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే, ఆత్మీయముగా తిరిగి జన్మించినవాడై దేవుని కుటుంబ సభ్యుడగును (యోహాను 3:3-5).

కొందరు సంఘ సభ్యులు కాకపోయినను, వారు సంఘ సభ్యులయినట్లే మనము కొన్నిసార్లు ప్రవర్తిస్తాము. వారు క్రీస్తుయొక్క ప్రాథమిక ఆజ్ఞలకు లోబడినట్లయితేనే సభ్యులు కాగలరు. వారు బాప్తిస్మము పొందినప్పుడు ప్రభువు వారిని రక్షిస్తాడు, సంఘముతో ఆయనే చేరుస్తాడు. దానిని మనం అంగీకరించాలి. ఒకడు చేయు

బాహ్య క్రియలనే మనం చూడగలము గాని దేవుడతని హృదయ అంతరంగముల నెరుగును. "అయినను దేవునియొక్క స్థిరమైన పునాది నిలకడగా ఉన్నది. ప్రభువు తన వారిని ఎరుగును అనునదియు, ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతినుండి తొలగిపో వలెను అనునదియు దానికి ముద్రగా ఉన్నది" (2 తిమో 2 : 19).

---

## క్రీస్తులో జీవించుట
## (Living in Christ)

"మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింప బడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మన కనుగ్రహించెను"

(ఎఫెసీ 1 : 3).

ప్రపంచమందలి అనేక దేశాల్లో వివాహపుటుంగరమును ధరించుట కద్దు. ఈ ఉంగరము (లేక మంగళసూత్రము) చిన్నదే అయినను తాను పెండ్లాడిన స్త్రీకి జీవితాంతము తన్ను తాను అంకితమైన పురుషుని యొక్క నిశ్చయతను తెలియజేయును.

క్రొత్త నిబంధనలో 'క్రీస్తులో' అను మాట చాల భావనా పూరితమైనది. భారమైన భావనాపూరిత ఆత్మీయ సందర్భములలోనే అది మనకు కన్పడును. "క్రీస్తులో" (రోమా 12:5), "క్రీస్తు యేసులో" (రోమా 8:34), "మన ప్రభువైన యేసులో" (రోమా 8:39), "ఆయనలో" (2 కొరింథీ 5:21), "ప్రభువైన యేసులో" (రోమా 14:14), "ప్రభువులో" (1 కొరి 4:17), "ఆయన కుమారునిలో" (1 యోహాను 5:11), "యేసులో" (ఎఫెసీ 4 : 21), "ప్రభువైన యేసులో" (2 థెస్స 3:12), "ఆయన కుమారుడైన యేసుక్రీస్తులో" (1 యోహాను 5:20) అను పదజాలములతో మనకు అది కన్పడును. క్రీస్తులో గల సమైక్య

తను, క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరములో నిలిచియుండుటను అది సూచించును. గనుక ఈ పదముయొక్క భావార్థమును మనము ఎరుగకపోతే దైవ సంకల్పములో సంఘముయొక్క స్థానాన్ని, భావాన్ని మనం గ్రహించుకొనలేము.

క్రొత్త నిబంధనలో "క్రీస్తులో" "సంఘములో" అను రెండు పదములు ఇంచుమించు ఒకే భావాన్ని సూచిస్తున్నాయి. క్రీస్తు అన్నిటికంటె పైగా హెచ్చింపబడుటను గూర్చి చెబుతు, పౌలు సమస్తముపైని ఆయనను దేవుడు సంఘమునకు శిరస్సుగా నియమించెనని, ఆ సంఘమునకు ఆయనే శిరస్సని చెప్పాడు (ఎఫెసీ 1 : 22, 23). పౌలు మాటల ప్రకారము సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నది. గనుక క్రీస్తులో యుండుట యనగా ఆయన సంఘములో యుండుటయే.

## ఘనతగల ప్రదేశము

మొదటిగా, 'క్రీస్తులో' యుండుట యను మాట ప్రభువు సంఘ సభ్యులైన వారికి చెందును. క్రీస్తులో మనము దేవునిచేత ఎంచుకోబడినవారము. "ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మన కనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయా సంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కొరకు నిర్ణయించుకొని...జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:4-6).

ఎవడు రక్షింపబడాలో, ఎవడు రక్షింపబడకూడదో యని ముందుగా నిర్ణయించబడుటను గూర్చి పౌలు వ్రాయుటలేదు. అయితే క్రీస్తులోనికి వచ్చి ఆయనయందు నిలిచియుండు వారందరిని రక్షించుటకు దేవుడుచేసిన ముందు నిర్ణయాన్ని గూర్చి చెప్పాడు.

జగత్తు పునాది వేయబడక మునుపే క్రీస్తు శరీరము ఒక ఘనత గల ప్రదేశమని దేవుడు నిర్ణయించాడు. మరియు క్రీస్తు శరీరములో ప్రవేశించు వారందరిని తనకు కుమారులుగను కుమార్తెలుగను స్వీకరించుటకై ఆయన ముందుగనే నిర్ణయించెను.

ఈ దైవిక నిర్ణయము మానవుని స్వేచ్ఛకు అభ్యంతరకరమైనది కాదు. సరిగదా ఎంపిక చేయబడినవారిలో ఉండుటకు ఎంచుకొనే శక్తిని అది మానవుని కిచ్చుచున్నది. క్రీస్తు శరీరమును రక్షించుటకు దేవుడు ముందుగనే నిర్ణయించెను; అయితే ఆ శరీరములోనికి వచ్చుటకు మానవుడు నిశ్చయించుకోవాలి. మరియు దానిలో నిలిచియుండుట కతడు నిశ్చయించుకోవాలి.

నోవహు రక్షింపబడే స్థానాన్ని దేవుడు నిర్ణయించాడు (ఆది 7:1); అయితే నోవహు, అతని కుటుంబము దానిలో ప్రవేశించాలి, దానిలో నిలిచి యుండాలి (ఆది 7:7). నోవహుకును అతని కుటుంబమునకును ఆ ఓడ ఘనతగల ఒక స్థానము. భూమిమీదనున్న జనులందరికంటె, నోవహు, అతని భార్య, అతని కుమారులు, కోడండ్రు ఓడలో యుండుటవలన దేవుడు ఎంచుకొనినవారు. దేవుని కరుణాకటాక్షముల వలన వారు రక్షింపబడిరి, సంరక్షింపబడిరి.

క్రీస్తుశరీరములో అనగా సంఘములో ప్రవేశించువాడెవడైనను ఘనతగల ప్రదేశములో ప్రవేశించును. అది దేవుడేర్పరచిన ప్రదేశము. మనము దేవుని బిడ్డలమో కాదో యనునది మనము చేసికొనిన ఎంపికనుబట్టి యుంటాది. రక్షించే స్థలాన్ని దేవుడు నిర్ణయించాడు. అయితే ఆ ప్రదేశములో ప్రవేశించి దానిలో నిలిచియుండుటకు మనము నిర్ణయించుకోవాలి. మనము క్రీస్తు శరీరములో ప్రవేశించుటకు నిశ్చయించుకొని నప్పుడు, మనలను ఆయన కుమారులుగను,

ఆయన వాగ్దానములకు వారసులుగను దేవుడు మనలను ఎంచు కొంటాడు.

## సిద్ధముచేయబడిన స్థానము

రెండవదిగా. క్రీస్తునందున్న వాడు ఘనతగల స్థానమునందుండుట మాత్రమేగాక, దేవునియందున్న ఆత్మీయాశీర్వాదము లన్నిటిని పొందుటకు సిద్ధము చేయబడిన స్థానమందున్న వాడవుతాడు. క్రీస్తు యొక్క శరీరము సమస్తమును పూర్తిగానింపుచున్నవాని సంపూర్ణతయైయున్న దని పౌలు చెప్పాడు (ఎఫెసీ 1:23). ఆయన యందు సర్వ సంపూర్ణత నివసింపవలెనని తండ్రియొక్క అభీష్టమాయెను (కొలస్స 1 : 19, 20). అందువలన "ఆయనయందు మీరును సంపూర్ణులై యున్నారు" అని అపొ. పౌలు చెప్పగలిగాడు (కొలస్స 2:10).

దేవుడు మన కనుగ్రహించు అన్ని ఆత్మీయాశీర్వాదములు క్రీస్తులో యున్నవి. ఎఫెసీ మొదటి అధ్యాయములో పౌలు తన దైవిక స్తోత్రాన్ని ఆరంభించినప్పుడు, క్రీస్తులో దేవుడు మనకేమి చేసాడో క్లుప్తముగా ఒక వచనములో చెప్పేసాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మన కనుగ్రహించెను" (ఎఫెసీ 1 : 3). అయితే ఒకడు క్రీస్తులోనికి వచ్చి, ఆయనయందు నిలిచి యుంటేనేగాని దేవుడు మన కొరకు దాచియుంచిన ఆత్మీయాశీర్వాదములను పొందలేడు.

క్రీస్తులో మనకు లభ్యమగు ఆశీర్వాదములను గూర్చి ఆలోచించుము. మొదటిగా రక్షణను గూర్చిన ఆశీర్వాదములు క్రీస్తులో మనకున్నవి. ఆయన యందు మనకు క్షమాపణ కలుగుచున్నది ఆయన యందు మనకు విమోచనము అనగా మన పాపములకు క్షమా

పణ కలిగి యున్నది (ఎఫెసీ 1 : 7). క్రీస్తులో మనము నూతన సృష్టి అవుదుము. "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17). యేసుక్రీస్తులో మనకు నిత్యజీవమున్నది. "అందుచేత ఏర్పరచబడిన వారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొంద వలెనని నేను వారికొరకు సమస్తమును ఓర్చుకొను చున్నాను" (2 తిమో 2:10).

రెండవదిగా, ఆయన కుమారత్వమునుబట్టి క్రీస్తులో మనకు ఆశీర్వాదము లున్నవి. క్రీస్తు యేసులో మనము తండ్రియొద్దకు వెళ్లే సంపూర్ణ మార్గ మున్నది. "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు". "ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మ యందు తండ్రి సన్నిధికి చేరగలిగి యున్నాము" (ఎఫెసీ 2:13, 18). ఆయన యందు మనకు నిత్య స్వాస్థ్యమున్నది. "దేవుడు తన చిత్త ప్రకారమైన సంకల్పమును బట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయనయందు స్వాస్థ్యముగా ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసార ముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించు చున్నాడు" (ఎఫెసీ 1:10, 11).

మూడవదిగా, క్రీస్తునందున్న భద్రతనుగూర్చిన ఆశీర్వాద ములు మనకున్నవి. "మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడిరి" (ఎఫెసి 1 : 13). క్రీస్తులో మనకు శిక్షా విధిలేదు. "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియులేదు" (రోమా 8 : 1).

క్రీస్తు శరీరమును, సమస్త ఆత్మీయాశీర్వాదములు స్థలముగా

పరలోకమందున్న మన దేవుడేర్పరచెను. ఆ శరీరములోనికి ప్రవేశించి దానియందు నిలిచియుండు వారికే ఆయాశీర్వాదములు లభ్యమగును.

## వాగ్దాన స్థానము

మూడవదిగా, భవిష్యత్తులో మనకున్న నిరీక్షణ క్రీస్తులో మాత్రమే యున్నది. ఈ జీవనయాత్రకు దోషరహిత మార్గదర్శిగా మానవ జ్ఞానము సరిపడజాలదు. అయితే బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే గుప్తములై యున్నవి (కొలస్స 2:3). ఈ లోకము నాశన మగుట తథ్యము (2 పేతురు 3:10). ఈలోక నిరీక్షణ ఏమైనాయుంటే అది వాడిపోవును. అయితే క్రీస్తులో వాడబారని నిత్యసాక్ష్యము మన కున్నది (ఎఫెసీ 1:11).

క్రీస్తునందున్న మన నిరీక్షణనుగూర్చి యోహాను ఇట్లు వ్రాసాడు: "ఆ సాక్ష్యమేమనగా-దేవుడు మనకు నిత్యజీవమును దయ చేసెను; ఈ జీవము ఆయన కుమారుని యందున్నది" (1 యోహాను 5 : 11). ఈ నిత్యజీవము మనకు రెండు విధములుగ కలుగును; ఈ లోకములో సమృద్ధియైన జీవితము, మరియు రాబోవు లోకములో నిత్యజీవము. క్రీస్తులో మనకు ఈ లోకములో నిరీక్షణ యున్నది, మరియు రాబోవు జీవితాన్ని గూర్చి నిరీక్షణ యున్నది: ఇప్పుడు సమృద్ధియైన జీవము, రాబోవు లోకంలో నిత్యజీవము. వారు జీవము కలిగి యుండుటకును, సమృద్ధియైన జీవము కలిగి యుండునట్లును నేను వచ్చితినని యేసు చెప్పెను (యోహాను 10:10). యోహాను ఇంకా ఇట్లన్నాడు: "దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు; దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవములేనివాడే" (1 యోహాను 5 : 12). మరల "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" అని అతడు చెప్పాడు (1 యోహా 5:13).

పాతనిబంధన కాలములో ఒకడు తెలియకయే పొరబాటున ఒకని చంపిన యెడల అట్టివాడు ప్రతిహత్య చేయు వానినుండి రక్షింపబడుటకు ఆశ్రియ పురమునకు పోవచ్చును (యెహోషువ 20). అతడు ఆశ్రియపురములో యున్నంతకాలము కాపాడబడేవాడు. ఆ పురములో అతడు సామాన్య జీవితాన్ని గడిపేవాడు. సామాన్య భవిష్యత్తు కలిగి యుండేవాడు. అయితే అతడా పురమును విడిచి వెళ్ళిన యెడల ప్రతిహత్యచేయువారు అతని తరుముదురు, బహుశ చంపివేయుదురు. గనుక అట్టివాని జీవనము భద్రత అంతయు ఆశ్రియ పురములోనే యుండేది.

అల్లే మన నిరీక్షణ అంతా క్రీస్తులోనే యున్నది. ఆయనకు వెలుపల ఈ లోకంలో సమృద్ధియైన జీవనానికిగాని, భవిష్యత్ నిత్య జీవితానికిగాని లభ్యమయ్యేది యేదీలేదు. క్రీస్తునుండి వేరుచేయబడిన అన్యజనులు నిరీక్షణ లేనివారని పౌలు చెప్పాడు (ఎఫెసీ 2:12). అల్లే క్రీస్తునకు వెలుపల యున్నవాడెవడైనను ఈలోకంలో నిరీక్షణలేనివాడే.

## ము గిం పు

క్రీస్తులో యుండుటను గూర్చిన ప్రాముఖ్యతను ఎరిగిన తరువాత క్రీస్తులో ప్రవేశించుట ఎట్లో యని అడుగకపోతే మనము బుద్ధిహీనుల మౌతాము. రోమా 6:3 లో పౌలు, మనము బాప్తిస్మము ద్వారా క్రీస్తులో ప్రవేశిస్తామని చెప్పాడు. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?". అదే సత్యాన్ని అతడు మరల గలతీ 3:27 లో తెలియజేసాడు: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు".

మనము క్రీస్తునందు విశ్వాసముంచి, పాపపు జీవితాన్ని గూర్చి మారుమనస్సు పొంది, దేవుని తట్టు తిరిగి, యేసేక్రీస్తని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు, దేవుని కృప

వలన మనము క్రీస్తులోనికి తేబడుదుము. వెంటనే మన స్థితి మార్చబడును. ఏలయనగా మనము ఒక ఘనతగల స్థిరపరచబడిన, వాగ్దానము చేయబడిన స్థానములోనికి తేబడియున్నాము. మనము దినదినము దేవుని వాక్యమును నెమరువేయుచు, క్రీస్తుతోను, దేవుని కుటుంబముతోను సహవాసము కలిగియుంటూ, వెలుగులో నడిచిన యెడల మన పరిస్థితి దినదినము మార్పునొందును.

క్రొత్తనిబంధన సంఘము మతశాఖ లన్నిటికంటె భిన్నమైనది. అది పరలోక ధన నిధులతో నింపబడియున్న క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరము. దాని సభ్యత్వము ఎప్పుడు ముగించబడదు. సువార్తకు విధేయుడైన వాడెవడైనను దానిలో ప్రవేశించి దేవునియొక్క సంపదలో పాలివాడు కావచ్చును. ప్రతి సభ్యుడు ఆత్మవలన క్రీస్తు యేసునందున్న ఆశీర్వాదము లన్నిటిని అన్ని వేళలా పొందనగును. పరలోక ధననిధి మూతవేయబడినట్లు గాని, లేదా దాని ఆత్మీయ నిధులు అంతమై పోయాయని గాని ఎవడును ఎన్నడును కనుగొనడు.

క్రీస్తునందున్నవాడు దేవుని బిడ్డయనే ఘనత గలవాడు, అతనికి ఆత్మీయాశీర్వాదములన్నీ లభిస్తాయి, మరియు అతనికి నిత్యజీవ నిరీక్షణ యున్నది. గనుక నీవు క్రీస్తులో యున్నావా? యనే ప్రశ్నకంటె శ్రేష్టమైన ప్రశ్న వేరొకటి యుండదు. —ఎడ్డీ క్లోర్, (TFT)

---

కొండమీద ప్రసంగము - 11

## ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు క్రీస్తు వచ్చెను

### ( Christ came to Fulfill the Law )

(మత్తయి 5 : 17-19)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో మొదట తన శిష్యుల కుండవలసిన శ్రేష్టమైన లక్షణాలను గూర్చి చెప్పారు. ఆ

లక్షణాలు ప్రజలకు కనబడేలాగున ఉండాలని ఆయన బోధించారు. తరువాత ఆనాడు ప్రబలమైయున్న యూదా మతాన్ని గూర్చి వారి తత్వం ఎట్లుండాలో తెలియజేసారు. మత్తయి 5:17-19 లో యేసు ప్రభువు ఇట్లు బోధించారు:

"ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననేగాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. కాబట్టి యీ ఆజ్ఞలలో మిగుల అల్పమైన యొకదానిని మీరి మనుష్యులకు ఆలాగున చేయ బోధించువాడెవడో వాడు పరలోక రాజ్యములో మిగుల అల్పుడనబడును; అయితే వాటిని గైకొని బోధించువాడెవడో వాడు పరలోక రాజ్యములో గొప్పవాడనబడును".

యేసుక్రీస్తు పరిపూర్ణ మార్గమును (లేక మతమును) స్థాపించుటకు ఈ లోకమునకు వచ్చెనుగాని ఆయన లోపభూయిష్టమైన యూదా మతాన్ని ఎదుర్కొనెను గనుక దానిని నాశనం చేయకుండా, నెరవేర్చి దానినిక లేకుండ జేసారు. యేసుప్రభువు బోధ ఆయన కాలమునాటి శాస్త్రులు పరిసయ్యులకాల బోధకంటె భిన్నముగా యుండెను. ప్రజలు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి (మత్తయి 7:28-29). గాని వారాయన బోధను అపార్థము చేసికొనరాదు. ఆయన పాతనిబంధనను నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు రాలేదు. పాతనిబంధన క్రొత్తనిబంధనకు వ్యతిరేకమైనది కాదు. ఈ రెండు నిబంధనలు క్రీస్తునుగూర్చియే చెప్పుచున్నవి. పాతనిబంధనలోని ప్రవచనములు, సంస్కారములు, పండుగలు వగయిరా అన్నియు క్రీస్తును గూర్చి ఆయన నీతిని

గూర్చియే చెప్పుచున్నవి. అవి రాబోవు మేలుల ఛాయయేగాని నిజ స్వరూపము క్రీస్తులో యున్నది (హెబ్రీ 10 : 1).

యేసుక్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చెను. మోషేయు, ప్రవక్తలును క్రీస్తు వస్తాడని ప్రవచించారు. ఆయన వచ్చి ఆ ప్రవచనములను నెరవేర్చెను. ఆయన ధర్మశాస్త్రము యొక్క నీతినంతయు నెరవేర్చాడు. ఆయన తన అతి పరిశుద్ధమైన జీవితంద్వారా దానిని నెరవేర్చెను. ఆయన జననము వలనను, జీవనము వలనను, మరణ సమాధి పునరుత్థానముల వలనను, ఆరోహణము వలనను, పాతనిబంధనలోని మాదిరులను, ప్రవచనములను, ఛాయలను అన్నిటిని సంపూర్తిగ నెరవేర్చెను. ధర్మశాస్త్రములో దాగియున్న లోతైన ఆత్మీయ సంగతులను వెలికి తెచ్చుచు దాని బోధను ఆయన నెరవేర్చెను. అందుకే "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" అని పౌలు చెప్పియున్నాడు (రోమా 10:4).

యేసుప్రభువు ధర్మశాస్త్రము నెట్లు నెరవేర్చెను? ధర్మశాస్త్రము కోరు సంగతులకు పరిపూర్ణముగా విధేయత చూపుట ద్వారా దానిని నెరవేర్చెను. మానవుని తత్వాన్ని ధరించుకొని ధర్మశాస్త్రమునకు పూర్తిగా ఆయన లోబడెను (గలతీ 4 : 4). ఆయన దేవుని నీతి యావత్తును నెరవేర్చెను. పాపమేమియు లేకపోయినను బాప్తిస్మమిచ్చు యోహానుచే ఆయన బాప్తిస్మము పొందెను (మత్తయి 3 : 15). ఆయన తన బోధద్వారా ధర్మశాస్త్రమును నెరవేర్చెను. ఆనాటి మతగురువులు తమ పారంపర్యాచారముల వలన ధర్మశాస్త్రమును కలుషితము చేసిరి. దేవుని వాక్యమును నిరర్థకముచేసిరి (మత్త 15:9). అయితే ఆయన సున్న పొల్లు తప్పకుండ దానిని నెరవేర్చెను. దానిలో ఆజ్ఞ ఎంత అల్పమైనదైనను దానికి ఆయన పరిపూర్ణ విధేయత

చూపించాలని బోధించెను. అట్లు చేయువాడే పరలోక రాజ్యము యొక్క పొరుడనబడును. ధర్మ శాస్త్రమును గైకొననివాడు యితరులు కూడ గైకొనరాదని ప్రోత్సహించును. పాపము చేయువాడు, పాప మును ప్రోత్సహించును. ఆజ్ఞను అతిక్రమించువాడు పాపముచేయును. క్రీస్తు ఒక్కడు తప్ప పాపములేని వాడెవడును లేడు. క్రీస్తు తన పరి పూర్ణ జీవితం ద్వారా ధర్మ శాస్త్రమును నెరవేర్చెను.

యేసుప్రభువు విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మ శాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి యూదులను, అన్యజనులను ఏకము చేసెను (ఎఫెసీ 2 : 14). జంతుబలులు, నానా విధములైన ప్రక్షాళనములు, శరీరసంబంధమైన సున్నతి, సబ్బాతు మొదలైన వాటికి ఆయన సమాప్తి ఆయెను. ఆయా ఆచార కర్మ లన్నియు క్రీస్తును సూచించుచు వచ్చెను. క్రీస్తు రాకడలో అవన్నియు నెరవేరెను గనుక అవి కరిగిపోయి (నెరవేర్చబడి) అంతమాయెను. ఆనాటి యూదుల సమాజమందిరములు క్రమేపి క్రీస్తు సంఘ సమావేశ స్థలములాయెను. ఏడవదినపు విశ్రాంతి దినముపోయి వారములో మొదటి దినము ఆరాధన దినమాయెను. విధి రూపకమైన ఆజ్ఞలు వగయిరా అవి ఎందుకు ఈయబడెనో వాటి ప్రయోజనము నంతటిని క్రీస్తు నెర వేర్చెను. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణము గాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2 : 14). నిజానికి "మనము విశ్వాస మూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనను నడిపించుటకు ధర్మ శాస్త్రము మనకు బాలశిక్షకు డాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము అని అపొ. పౌలు బోధించాడు (గలతీ 3:24-25).

ఏదేను వనములో ఆదాము హవ్వలు పాపము చేయగా వారిని మోసగించిన సర్పమును దేవుడు శపించుచు, "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదు వని" చెప్పెను (ఆది 3 : 15). ఇక్కడ చెప్పబడిన దేవుని చిత్తాన్ని క్రీస్తు నెరవేర్చెను. మానవుని క్రీస్తుద్వారా పాపమునుండి విమో చించుటకు దేవుడిక్కడ వాగ్దానము చేసెను. ఆయన స్త్రీయందు పుట్టెను (గలతీ 4:4), దేవుని దూత యోసేపుకు ప్రత్యక్షమై కన్యయైన మరియ "యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపమునుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్త 1:21). పాతనిబంధన రాబోవుచున్న రక్షకుని గూర్చి చెప్పెను. క్రీస్తు వచ్చి దాన్ని నెరవేర్చెను. ఇప్పుడు మనము సత్యవాక్యమును, అనగా రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దా నము చేయబడిన నిత్యస్వాస్థ్యమునకు వారసులము కాగలము (ఎఫెసీ 1:13). పాతనిబంధనలో బయలుపర్చబడిన దేవుని చిత్తాన్ని క్రొత్త నిబంధనలో క్రీస్తు నెరవేర్చెను.

క్రీస్తు పాతనిబంధనలో ఛాయ రూపకముగ ఉపయోగింపబడిన వాటియొక్క నెరవేర్పు అయ్యున్నాడు. హేబెలు అర్పించిన గొర్రె పిల్ల (ఆది.కా. 4). ఇస్సాకుకు బదులు అబ్రహాము అర్పించిన గొర్రె పిల్ల (ఆది కా. 22), మరియు యూదులు పస్కానాడు అర్పించే గొర్రె పిల్ల మొదలైనవన్నియు (నిర్గమ 12), లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లయైన యేసుక్రీస్తును సూచించుచు వచ్చాయి. పాపపరి హారార్థ బలిగా గొర్రెపిల్లయైన యేసుక్రీస్తు అర్పింపబడగా పాతనిబంధన లోని జంతుబలు లన్నిటికి ఆయన సమాప్తి అయ్యాడు. తద్వారా పాతనిబంధనలోని మాదిరులను, ఛాయలను యేసుక్రీస్తు నెరవేర్చాడు.

పాతనిబంధన మానవుని విమోచనను చిత్రీకరించింది. క్రీస్తే ఆ చిత్రమని ప్రవచనాలు సూచించాయి. అవన్నియు ఆయనలో నెరవేరాయి. అందుకే ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చానని యేసుప్రభువు చెప్పారు. చేయబడిన వాగ్దానం నెరవేర్చబడిన తరువాత, ఆ వాగ్దానమును గూర్చిన నిరీక్షణ మనకుండదు. యేసుప్రభువు ధర్మశాస్త్రమును, ప్రవక్తల వచనములను పరిపూర్ణముగ నెరవేర్చెసాడు.

ధర్మశాస్త్రము విధించే శిక్షను భరించుటద్వారా క్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చెను. ధర్మశాస్త్రము పరిపూర్ణత కోరింది, లేదా శిక్ష విధించింది (గలతీ 3 : 10-13). దేవుడు పరిశుద్ధుడు గనుక పాపమును ఆయన సహించడు. దేవుడు సహించాలంటే ఏదెనులో ఆదాము యొక్క పాపాన్నే సహించియుండును. ధర్మశాస్త్రము కూడ పాపాన్ని సహించలేదు. ధర్మశాస్త్ర ప్రకారము పరిపూర్ణంగా ఎవడైనా జీవిస్తే అట్టి వానితో దేవుడు సహవాసము కలిగి యుండును. అయితే పాపము లేని జీవితాన్ని జీవించి క్రీస్తు ధర్మశాస్త్రాన్ని పూర్తిగ నెరవేర్చాడు. ఆయన సిలువమీద చనిపోయినప్పుడు ధర్మశాస్త్రాన్ని అతిక్రమించి నందువలన చనిపోలేదు. ఆయన ధర్మశాస్త్రాన్ని గౌరవిస్తు పాపము లేనివాడుగ జీవించెను గనుక దేవుడు తాను నీతిమంతుడును, యేసునందు విశ్వాసము గలవానిని నీతిమంతునిగా తీర్చువాడై యుండుటకు సాధ్యమయ్యింది (రోమా 3:25-26).

యేసుక్రీస్తు గనుక పాపములేని జీవితం జీవించి యుండకపోతే ధర్మశాస్త్రకాలమందు జీవించిన వారికి నిరీక్షణ లేకయుండును. అయితే క్రీస్తుయొక్క పాపరహిత జీవితం దేవుని ఘనపర్చింది. ధర్మశాస్త్రము యొక్క యథార్థతను ధృవపరచింది. పాపియైన మానవునికి దేవుని కృప ననుగ్రహించింది. ధర్మశాస్త్రము కోరునది యావత్తు క్రీస్తు నెరవేర్చి మనకు విమోచన అనుగ్రహించెను. ధర్మశాస్త్ర ప్రకారం

ఎవరైనా పరలోకానికి వెళ్ళితే అదివారి పరిపూర్ణతను బట్టియు, క్రియలను బట్టియు, ఉండును. అయితే అట్టి జీవితాన్ని జీవించగలిగిన వాడెవడును లేడు. ఎవరైనా పరలోకం చేరగలిగితే అది క్రీస్తు యేసు నందలి విశ్వాసము వలనను, దేవుని కృపవలననే గాని మన క్రియ లనుబట్టి కాదు.

"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ 2:8-10). క్రీస్తు కృపయొక్క పరిపూర్ణత అటు పాతనిబంధన కాలంలో జీవించినవారికి, ఇటు క్రొత్త నిబంధన కాలంలో జీవించుచున్న వారికి వర్తించును. యేసుక్రీస్తు పాతనిబంధనను అన్ని విషయాల్లో సంపూర్తిగ నెరవేర్చెను. అది నెరవేరువరకు దానినుండి ఒక పొల్లయినను, సున్నయైనను గతించిపోలేదు. పాతనిబంధనను దేవుని వాక్యముగా మనం గౌరవించి చదవాలి. ఒక చట్టమువలె దానికి ఇప్పుడు మనం బద్ధులమై యుండలేదు. పాతనిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తు నందు కొట్టివేయబడెనని మనం గ్రహించాలి (2 కొరింథీ 3 : 14). క్రీస్తుయొక్క వాక్యాన్ని విని, విశ్వసించి దాని ప్రకారము చేయు వాడు పరలోకరాజ్యములో అనగా ఆయన సంఘములో గొప్ప వాడనబడును.

—జాషువా గూటం.

---

## మనము కాదనలేని సత్యము

(నవంబరు సంచిక తరువాయి)

—T. జాన్ S. ఫ్రెడరిక్, పెద్దాపురం.

చరిత్రకారుల వివరణ ప్రకారముగా ప్రభువుయొక్క చేతులు రెండు పైకికట్టి ఫ్లేజిలం అనే కొరడాతో కొట్టడము ప్రారంభించినారు. ఈ ఫ్లేజిలం అనే కొరడాకు 12 చిలువలు వుండును. ఈ చిలువలకు

ఒత్తుగా గాలము ముళ్లు, మేకులు, వాడియైన ఎముక ముక్కలు గుచ్చి వుండెను. దూరముగా నిలువబడి ప్రభువును ఆ కొరడా విసిరి కొట్టిన ప్పుడు ఆ కొరడా చిలువలకు గుచ్చబడిన ముండ్లు ప్రభువు శరీరము లోనికి గుచ్చుకొని రాకుండా వున్నపుడు ఆ కొరడాను బలిమితో విదిలించి లాగినప్పుడు ప్రభువు శరీరమునుండి మాంసపు కండలు ఆ కొరడాతో వచ్చినవి. ఆ కొరడా చిలవలతో నలుబదిసార్లు ప్రభువు శరీరమును కొట్టి లాగినప్పుడు శరీరమునుండి కండలు, కొరడా దెబ్బ లకు లాగబడి బయటకు వచ్చినవి. ఆ నలుబది కొరడా దెబ్బలకు ప్రభువు శరీరము తూట్లు తూట్లుగా అయినది. శరీరమంతయు రక్తపు కండలతో నిండిపోయినది. అంత క్రూరముగా ప్రభువు శరీరమును తూట్లు చేయుటయే కాకుండా ఆ సైనికులు ప్రభువు రాజుకదా అని బలమైన ముండ్లతో ముండ్లచుట్ట యేసుప్రభువు తలపై గట్టిగా దిగ గొట్టినారు. ఆ ముండ్లు ప్రభువు శరీరముపై నాటుకొని రక్తపు ధారలై ముఖము మీదుగా కారెను. ప్రభువు ముఖము రక్తధారలతో నిండి పోయినది. ప్రభువు చేతుల బంధకములు తీసివేయగా, ఆ నలుబది కొరడా దెబ్బలతో కొట్టబడిన శరీరము క్రిందికి జారిపడి ప్రభువు పాద ములక్రింద మడుగుకట్టిన రక్తముతో ఆయనే జారి పడిపోయినారు. లేచుటకు ప్రభువువారి శరీరములో శక్తి లేకపోగా భటులు ఆయనను లేవనెత్తినారు. అక్కడనే చనిపోతారేమోనని తొందరగా భారమైన సిలువకొయ్య తీసికొని వచ్చి. ప్రభువుయొక్క గాయపడిన భుజము లపై మోపి. వీధిలోనికి ప్రభువును నడిపించినారు. యేసుప్రభువువారు నడువలేక చీమ నడకతో సిలువకొయ్య మోయుచు చివరియాత్ర సాగించారు. యెరూషలేము పట్టణము రాతికొండ. ఆ పట్టణపు వీధులు రాళ్ళతో నిండియుండెను. యేసుప్రభువువారి శరీరమునుండి దిగజారిన రక్తముతో తడిసిన పాదములు ఆ రాళ్ళను తొక్కుకుంటూ, గిజగిజ మని రాళ్ళపై జారుతూ ప్రయాణము చేసినవి. చదువరీ! నీకును,

నాకును అంత్యదినము ఒకటి వున్నదని జ్ఞాపకముంచుకొనుము. ఆ దినమున ఈ రాళ్లు కేకలు వేయునని చెప్పిన ప్రభువు, ఆ రాళ్ళతో కేకలు వేసి సాక్ష్యమిమ్మని ఆజ్ఞ యిచ్చి వుంటే రాళ్ళు కేకలతో మాట్లాడుతాయి. ఏమని? "ఔను ప్రభువా, నీ పాదములు మామీద మోపినప్పుడు అవి గిజగిజ వణికినవి. నీ పాదములు అడుగులకు స్రవించిన నీ రక్తము ప్రభువా! మాకు అంటుకొనినది. నిజమే, నీవు లోకమును ఎంతో ప్రేమించినది నిజమే!" అని ఆ రాళ్లు కేకలు వేసి సాక్ష్యమియ్యగలవు.

## సిలువ భారము

యెషయా గ్రంథము 53వ అధ్యాయములో వర్ణించినట్లు ప్రభువుయొక్క ముఖములో సురూపము, సొగసు మాయమైపోయినది. రక్తము విరివిగా కారినందున శరీరములో బలము లేనందున దప్పికతో పెదవులు ఎండిపోయెను. శరీరమునుండి కారిన రక్తధారలు పెదవుల మీదుగా కారి, ఆ పెదవులకు రక్తము ఉప్పగా తగిలినది. ప్రభువు వారు ఆయన శరీరముపై ముండ్ల కిరీటము అణచి (గుచ్చ బడుటచేత) రక్తధారలు శిరముక్రిందికి కారుటవల్ల కన్నులు రక్తముతో నిండి యుండుటచేత తేటగా చూడలేకపోయినారు. ప్రభువువారు శిలువమీద వేసుకొని తేటగా చూడలేక తూలిపడిపోయూరు. ప్రభువు తూలి పడి పోవుటకు ఇదిఒక కారణం కావచ్చు. శిరమునుండి కారిన రక్తము పెదవులకు ఉప్పగా తగిలినది. అదే ఆయన దాహము. ప్రభువువారు సిలువభారము మోయలేక ఒగుర్చుచూ అధికశ్వాస భారముతో నోటితో ఒగర్చుకొంటూ సాగినారు. గొల్గతాదిబ్బ సమీపించు చుండగా ప్రభువువారు సిలువను మీద వేసుకొని క్రిందకు తూలి పడిపోయినారు. ఆ సమయములో చదువరీ! మనము ప్రభువు జ్ఞాపకములోనికి వచ్చినాము. మనము రక్షింపబడితే చాలునని ప్రభువు అనుకొన్నారు.

గొల్లతాదిబ్బ ఎక్కలేనప్పుడు ఆ యూదులు దారిని పోవు చున్న కురేనీయుడైన సీమోను అనునతని ఆపుజేసి, సిలువకొయ్య చివర మోయుటకు అతనిని బలవంతము చేసినారు. గొల్గతా దిబ్బపైకి సిలువను మోసి క్రిందికి పడిపోయిన ప్రభువును ఆ సిలువ మ్రానుక్రింద వేసి, రెండు చేతులు ప్రక్కలకు చాపి, కాళ్లు రెండు క్రిందికి లాగి, బలమైన కరకు మేకులు తీసికొనివచ్చి బరువైన సుత్తితో ప్రభువుయొక్క హస్తములలోనుండి దిగగొట్టుచుండగా ఈ ప్రభువు యొక్క ప్రాణము వారి క్షమాపణకొరకు కేకలు వేసెను. ఆ కేకలతో ప్రభువువారు సుత్తి శబ్దములు వినబడనీయలేదు. ఆ కొండపై లోతైన గొయ్యి త్రవ్వినారు. త్రవ్విన గోతిలో సిలువను ప్రభువువారితో యెత్తి కుతక వేసినారు. ప్రభువువారి చేతులు, పాదములు మేకులనుండి బరువుతో దిగజారినవి. రెండువందల గజముల దూరములో తండ్రియైన దేవుడు ఆరాధింపబడుచుండగా, గొల్గతా దిబ్బపై కుమారుడైన ప్రభువు ప్రాణము తీయుటకు రోమా భటులు ప్రభువును వ్రేలాడ గట్టగా, ఒక క్షణముకాదు, ఒక నిముషముకాదు, ఆరు గంటలు (ఆ 6 గంటలు eternity) ఆ సిలువమ్రాను అంతా రక్తమయమయినది. ప్రపంచములో పశ్చాత్తాపముతో దుఃఖించిన కన్నీరు ఆ రక్తపు మ్రానును కడగగలదా?

## ఏకైక దైవము

క్రీస్తు ప్రభువువారు సిలువపై చివరి ఏడు వచనములు మన రక్షణ కొరకు పలికిన వచనములు. చివరకు ప్రభువువారి ప్రాణము బిగ్గరగా కేక వేసి ప్రభువును విడిచినది. ఘనమైన చదువరీ! పాపక్షమాపణ కొరకు మానవలోకము నిమిత్తము శ్రమ పొందిన దైవము యేసుక్రీస్తు ప్రభువు ఒక్కరే. మానవలోకము పూజించు దైవములలో ఏ దైవము ఇంత త్యాగము చేయలేదు. ఏ దేవతా మనకొరకు తన

ప్రాణమును అర్పించలేదు. ఆరు గంటలు రక్తము ఓడ్చలేదు. మానవ పాపక్షమాపణ నిమిత్తము విజ్ఞాపన చేయలేదు. క్రీస్తుప్రభువు వారు ఒక్కరే. ఘనమైన చదువరీ, మీరు గమనించండి. యేసు ప్రభువు ఆరు గంటలు సిలువపై వ్రేలాడి, తలవాల్చి ప్రాణము విడిచి పెట్టగా, వేలాడుచున్న శరీరము బళ్ళెముతో బలంగా పొడవగా ప్రభువు యొక్క గుండెను ఆ బళ్ళెము చీల్చివేసినది. వెంటనే నీరు, నెత్తురు కారినవి. ఇవి యేసుప్రభువు వారియొక్క సిలువ, శ్రమ, మరణములు.

యేసుక్రీస్తు ప్రభువువారు లోకములో సంపాదించినది ఏమీ లేదు. అంతా ఎరువుజీవితమే. ఆయన బోధించుటకు కూర్చున్న దోనె ఎరువు దోనె. ఆయన యెరూషలేములోనికి ఎక్కి వచ్చినది ఎరువు గాడిద పిల్ల. ఆయన ప్రభుత్వమునకు చెల్లించవలసిన అర పెకెలు పన్ను చేప నోటపెట్టుకొని తెచ్చినది. ఆయనను పండుకొన బెట్టిన సమాధి ఎరువు సమాధి. ప్రభువువారు సర్వజ్ఞాని, ఆయన నేత్రములకు నీ భవిష్యత్తు, నా భవిష్యత్తు కన్పించగలవు. ఒలీవ కొండపై కూర్చొని ఏడ్చిన దినమున ఆ పట్టణపు ఘోరమైన దుస్థితి, అనగా, ఆ పట్టణమునకు 41 సంవత్సరముల తరువాత సంభవించెడు ఘోరమైన దుస్థితి ప్రభువు నేత్రములు చూచి, ఏడ్చి కన్నీరు విడిచినవి. ప్రభువువారు పరలోకమునకు ఆరోహణమైన 41 సంవత్సరముల తరువాత సంభవించబోవు దుస్థితిని చూచినారు.

చదువరీ, గమనించుము. ఆయనను సిలువవేసిన తరువాత ప్రభువువారి వస్త్రములు సిలువవేసిన భటులు పంచుకున్నారు. ఆయన అంగీపైనుండి క్రిందికి నేయబడి యుండుటచేత దాని నిమిత్తము తమలో తాము చీట్లు వేసికొనియున్నారు. ఆయన అంగీకొరకు చీట్లు వేసిన విషయము యేసుప్రభువువారు పుట్టక మునుపే అనగా 1,000 సంవత్సరముల ముందే ప్రవక్తయైన దావీదు దీనిని వ్రాసినాడు.

తరువాత ఆయన తలపై యూదుల రాజని వ్రాసియుంచినారు. (INRI=Jesus Nazareneus Rex Jedaeorun=Jesus of Nazareth King of the Jews). క్రీస్తు ప్రభువువారు ఉదయము 9 గంటల నుండి సాయంకాలము 3 గంటల వరకు అనగా 6 గంటలు సిలువపై వ్రేలాడినారు. చివరగా 7 వచనములు నుడివిన తరువాత తలవాల్చి, ప్రాణము విడిచిపెట్టినారు. అరిమతయ యోసేపు అను నతడు పిలాతువద్దనుండి ప్రభువు శరీరమును దింపి తీసికొనుటకు అనుమతి పొంది యేసు శరీరమును తీసికొని వెళ్ళి, తనకొరకు ఏర్పాటు చేసుకొన్న సమాధిలో, బట్టచుట్టి యేసుప్రభువును పరుండజేసినాడు. అది యెరువు సమాధిసుమా! యేసుప్రభువు జీవితమంతా యెరువు జీవితమే. యేసుప్రభువువారు సమాధిలోనుండి మూడవ దినమున లేచి శిష్యులకు కనిపించినారు. ఒక్కసారే 500 మందికి ఆయన కన్పించి మాట్లాడినారు. యేసుక్రీస్తు ప్రభువువారు ఆయన దైవత్వమును నిరూపించడానికి ఒక రోజుకాదు, రెండు రోజులుకాదు, నలుబది దినములు ఆయన రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక ఋజువులను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపర్చుకొన్నారు. ఆఖరుగా శిష్యులకు ప్రభువువారి రక్షణ సువార్తను ప్రకటించమని ఆజ్ఞాపించిన తరువాత వారి కన్నుల యెదుట ఆకాశములోనికి ఆరోహణమైనారు. (సశేషం)

---

## ధర్మశాస్త్రము కొట్టివేయబడినదా ?

బైబిలు రెండు ప్రాముఖ్య భాగములుగా విభజింపబడెను. 1. పాత నిబంధన 2. క్రొత్త నిబంధన. నిబంధన అనగా, ఆజ్ఞలతో కూడిన లిఖితపూర్వకమైన ఒడంబడిక లేక ఒప్పందము. పాత నిబంధన ఇశ్రాయేలీయులకు దేవునికి మధ్య జరిగిన ఒప్పందము. ఈ నిబంధన మోషేద్వారా ఇశ్రాయేలీయులకు ఇయ్యబడెను. క్రొత్త నిబంధన

దేవునికిని క్రైస్తవులకును సర్వలోకమునకు మధ్య జరిగిన ఒప్పందము. ఇది యేసుక్రీస్తుచే ఇయ్యబడినది. దానిద్వారా మనము దేవునియొద్దకు చేరుచున్నాము (హెబ్రీ 7 : 18, 19). ఇది స్వాతంత్రము నిచ్చు సంపూర్ణ నియమము (యాకోబు 1:26).

## 1. పాత ధర్మశాస్త్రము ఎవరికి ఇయ్యబడినది ?

ధర్మశాస్త్రము కేవలం ఇశ్రాయేలీయులకు మాత్రము దేవుడు ఇచ్చెనుగాని అన్యులకు యివ్వలేదు (కీర్తనలు 147:`9, 20; ద్వితీయో 5:1, 2). యెహోవా మన పితరులతో కాదు నేడు సజీవులమై నిలచి యున్న మనతోనే యీ నిబంధన చేసెను. ఎఫెసీ 2:12 ఆ కాలమందు ఇశ్రాయేలీయులతో సహ పౌరులు కాక...అనగా కేవలం ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే యిచ్చారు అని అర్థమవుతుంది (నిర్గమ 20:1, ద్వితి 5:1-22).

## 2. అయితే ఈ ధర్మశాస్త్రము ఎప్పుడు ఇయ్యబడింది ?

బైబిలు గ్రంథములో 3 యుగములు కలవు : 1. పితరుల యుగము. 2. మోషే యుగము లేక యూదుల యుగము. 3. క్రైస్తవ యుగము లేక క్రీస్తు యుగము. దేవుడు పితరుల యుగములో లిఖిత పూర్వకమైన ఆజ్ఞలు ఇవ్వలేదు. కుటుంబ యజమానితో మాట్లాడే వారు. ఇది యించుమించు 2,500 సం॥లు ఆదాము మొదలు సీనాయి పర్వతం వరకు ఉండెను. దేవుడు అబ్రాహాముకు వాగ్దానం చేసిన 430 సం॥ల తరువాత యూదుల యుగం వచ్చెను. ధర్మశాస్త్ర యుగము పెంతెకోస్తునాడు పరిశుద్ధాత్మని రాకవరకు ఉన్నది. ఇది యించు మించు 1500 సం॥ లుండెను.

## 3. ధర్మశాస్త్రము ఎక్కడ యియ్యబడింది ?

దేవుడు ధర్మశాస్త్రమును సీనాయి పర్వతముమీద యిచ్చెను (నిర్గమకాండ 13:18-22).

## 4. ఈ ధర్మశాస్త్రములో యియ్యబడిన కట్టడలు ఏమిటి?

పది ఆజ్ఞలు, పండుగలు, అమావాస్యదినాలు, సున్నతి మొదలగునవి. ముఖ్యంగా విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించాలి. ఆ దినమున ఏ పనియు చేయకూడదు. కనీసం నిప్పుకూడ రాజబెట్టకూడదు, దూరప్రదేశాలు వెళ్ళకూడదు, రాకూడదు, ఏటక్క పని కూడ చేయరాదు. తప్పనిసరిగా ముఖ్యమైన పండుగలను ఆచరించాలి. బలులు కూడ అర్పించాలి. మరి ఈనాడు ధర్మశాస్త్రము కొట్టివేయబడలేదని చెప్పువారు బలులు అర్పించుచున్నారా? లేదు. ఆ ధర్మశాస్త్రము దేనికి సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు. సంపూర్ణ నియమము కాదు. బరువైన కాడి "మోయజాలని కాడి" కాబట్టి దేవుడు మరల, వేరొక నిబంధనను చేయుదునని చెప్పెను. యిర్మియా 31:31. ఇశ్రాయేలు వారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చియున్నవి...ఇక్కడ క్రొత్త నిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నారు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగును (హెబ్రీ 8:7, 13).

## 5. యేసుక్రీస్తు దానిని నెరవేర్చి కొట్టివేసెను.

మత్తయి 5:17, 18.

ధర్మశాస్త్రము నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు రాలేదు అనగా యేసుక్రీస్తు నెరవేర్చి కొట్టివేసెను. సంపూర్ణముగా నెరవేర్చెను. లూకా సువార్త 24:44, హెబ్రీ 10:1, కొలస్స 2:16, హెబ్రీ 10:9. ఎఫెసీ 2:14. మధ్యగోడను పడగొట్టి మన ఉభయులను ఏకముచేసెను. అనగా అటు అన్యులను, ఇటు యూదులను, సర్వ ప్రజలను ఏకము చేసెను. మార్కు 16:24, రోమా 1:16.

## 6. ఏ విషయములో కొట్టివేసెను?

బలులు, పండుగలు, విశ్రాంతి దినము. 7వ రోజు శనివారం

వాయిద్యములు, అమావాస్యలు, సున్నతి ఇంకా మొదలగునది సర వేర్చి కొట్టివేసెను. ధర్మశాస్త్రము కొట్టివేయబడలేదు. అది నిలిచి యున్నది అని చెప్పేవారు సులభమైనవి ఎంచుకొని చేయుట తప్ప. బలులు పండుగలు విశ్రాంతి దినం తీసివేసి కేవలం వాయిద్యములు మాత్రం వాయించితే ఏమి ప్రయోజనం? (యాకోబు 2:10).

## 7, కొట్టి వేయబడిన ధర్మశాస్త్రము ఇప్పుడు మనకు ఏ విధముగా ఉపయోగపడుచున్నది ?

అయితే కొంతమంది ధర్మశాస్త్రము కొట్టివేయబడినది కదా! అయితే అది ఎందుకు? దానిని ప్రక్కన పెట్టి క్రొత్తనిబంధననే వాడ వచ్చునుగదా! అని అందురు. కాని మనము దానిని తప్పక చదవ వలెను. ఎందుకనగా సృష్టిగురించి తెలుసుకోవాలి అంటే పాతనిబంధ నకు వెళ్లాలి. తరువాత మన పితరుల గురించి, విశ్వాస వీరుల గురించి క్రీస్తు జననము, మరణము, పునరుత్థానం యొక్క ప్రవచనాలు గురించి తెలుసుకోవాలంటే పాత నిబంధనకు వెళ్ళాలి. ధర్మశాస్త్రము కొట్టి వేయబడింది అని వాక్యం చెప్పుచున్నది అయినను దానిని చద వాలి అనికూడ చెప్పుచున్నది. ధర్మశాస్త్రము మనకు బాలశిక్ష కుడుగా నున్నది క్రీస్తు నొద్దకు నడిపించుట కొరకు (గలతీ 5 : 24,25).

కనుక ప్రియా చదువరీ! ధర్మశాస్త్రమనే ముసుగు తీసి వేసికొని క్రీస్తు దగ్గరకు రమ్ము. ఆయన యొద్దకు రావాలి అంటే క్రీస్తు నందు విశ్వాసముంచుము (హెబ్రీ 11 : 1, 6). మారుమనస్సు పొందుము (లూకా 13 : 3, 5). క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పు కొనుము (రోమా 10 : 9, 10; మత్తయి 10 : 32, 33). నేడే బాప్తిస్మము పొంది ఆయన సంఘములో చేరుము.

—జె.కె. ఏలియా, కాకినాడ స్కూలు ఆఫ్ ప్రీచింగ్.

# సంక్షిప్త వార్తలు

ఏటేటా కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ నిర్వహించుచున్న బైబిలు సెమినార్ 1994 డిశంబరు 12 నుండి 17 వరకు అత్యంత ఘనముగా, కన్నుల కింపుగా, వీనులకు విందుగా జరిగెను. కాకినాడ విద్యుత్ నగర్‌లోని విశాలమైన ఆవరణలో వేయబడిన పందిరిలో ఈ సెమినార్ నిర్వహించబడెను. దీనిలో సోదరులు పెర్రి కోతమ్, జాన్ ఫోర్డ్ మరియు సోదరి నేన్సీ ఫోర్డ్ పాల్గొనిరి, వాక్యపరిచర్య చేసిరి.

పెర్రి కోతమ్‌గారు తన సహజ శైలిలో, సులభ పద్ధతిలో దేవుని సత్యవాక్యమును బోధించిరి. సెమినార్ అంతటిలోను ఆయన 16 ప్రాముఖ్యమైన బైబిలు అంశములపై వాక్యోపదేశము గావించిరి. మరియు సభికులు అడిగిన వివిధ బైబిలు ప్రశ్నలకు సునాయాసముగా జవాబులిచ్చిరి. సోదరులు జాన్ ఫోర్డ్‌గారు లూకా సువార్తను చక్కగా వివరిస్తూ దానిలో నిగూఢమైన సత్యములను వివరించిరి. సోదరి నేన్సీ ఫోర్డ్ అనుదినం స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించిరి. సెమినార్ జరిగిన ఆరు రోజులలోను మొత్తం 158 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మరియు అనేక ప్రజల చేతులలో దైవ వాక్యమునుంచే పరిచర్యలో వేలకొలది బైబిలు గ్రంథములు అతి తక్కువ ధరకు ప్రజలకు విక్రయించబడెను. దూరప్రాంతములనుండి వచ్చిన వారికి చక్కటి భోజన, వసతి సౌకర్యములు కల్పించబడెను.

డిశంబరు 16వ తేదీ మధ్యాహ్నము కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ గ్రాడ్యుయేషన్ అత్యంత ఘనముగా నిర్వహించబడెను. రెండు సంవత్సరముల కోర్సు పూర్తిచేసిన 17 మంది విద్యార్థులకు ఆనాడు పట్టప్రదానము గావించబడెను. ఈ పట్టభద్ర సమావేశము నకు రంగరాయ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ Dr. I. విశ్వేశ్వర రావ్‌గారు ముఖ్య అతిథులుగా ఆహ్వానించబడిరి.

డిశంబరు 9, 10, 11 తేదీలలో గుంటూరు మహానగరములో బైబిలు సెమినార్ నిర్వహింపబడెను. దానిలో పెర్రి కోతమ్‌గారు, జాషువా గూటంగారు, నెహెమ్యా గూటంగారు వాక్యపరిచర్య చేయగా మొత్తం 52 మంది క్రీస్తులోని బాప్తిస్మము పొందిరి. గుంటూరులో క్రీస్తుకొరకు పనిచేయుచున్న అనేక సువార్తికులు ఈ సెమినార్‌లో పాల్గొని ఆనందించిరి. గుంటూరు పట్టణంలో సోదరులు M. ఫిలిప్పు గారు క్రీస్తుకొరకు మంచి పని చేయుచున్నారు. డిశంబరు 18, 19, 20వ తేదీలలో వరంగల్లు పట్టణంలో గొప్ప బైబిలు సెమినార్ నిర్వహించబడెను. సోదరులు పెర్రి కోతమ్‌గారు వాక్యపరిచర్య చేసిరి. వేలకొలది ప్రజలు హాజరైరి. వారిలో 373 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ సెమినార్ నిర్వహించిన ఈ మూడు పట్టణములలోను మొత్తము 663 మంది బాప్తిస్మము పొందిరి. 1995 జనవరి 5వ తేదీనుండి స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ యొక్క శాఖని వరంగల్లు పట్టణములో Bro. నెహెమ్యా గూటంగారు ప్రారంభింపబోవుచున్నారు. వరంగల్లులో Bro. K. సత్యనారాయణ గారు క్రీస్తుకొరకు గొప్ప పని చేయుచున్నారు. ★

---

Regd. No. H/KD—45/KD H.O
Date of Posting : 15th of Every month

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................